

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం,5 జులై 2025 | 8 పేజీలు


## ఘనంగా జెఎన్‌టియుకె

# 11వ స్నాతకోత్సవ వేడుకలు











**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

జెఎన్‌టియుకె 11వ స్నాతకోత్సవ వేడుకలను శుక్రవారం సాయంత్రం యూనివర్శిటీ అలూమ్ని ఆడిటోరియంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ మరియు యూనివర్శిటీ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షతన జరిగిన ఈ స్నాతకోత్సవ వేడుకలకు అమెరికాలోనిబోస్టన్ గ్రూప్ ఛైర్మన్ కోట సుబ్రహ్మణ్యం (సుబుకోట) ముఖ్య అతిథిగా విచ్చేయగా ఆయనకు గౌరవ డాక్టరేట్ (హానరిస్‌కాసా)ను ప్రధానంచేశారు. స్నాతకోత్సవంలో ఉపకులపతి ప్రొ.సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, రెక్టార్ ప్రొ.కె.వి.రమణ,ఇన్‌ఛార్జిరిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్, ఓఎస్‌డి ప్రొ.డి.కోటేశ్వరరావు, డైరెక్టర్‌లు, జెఎన్‌టియుకె కళాశాలల ప్రిన్సిపాల్స్ వేదికనలంకరించారు. ఈనేపథ్యంలో గవర్నర్ & కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ పిహెచ్‌డి అవార్డు గ్రహీతలు, బంగారు పతకాలు సాధించినవిద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఆయన పరిశోధకులను, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత ధైర్యంగా, విభిన్నంగా ఆలోచించాలని, సమస్యలను ఎదుర్కొని విజయబావుటా ఎగురవేయాలన్నారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటి, ఇ–మొబిలిటీ, రెన్యూవబుల్ ఎనర్జీ, లాజిస్టిక్స్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ,అన్వేషణ,పరిశోధన,తాత్విక ఆలోచనలతో సాంకేతికతను ముందుకు తీసుకువెళ్ళాలన్నారు. క్వాంటమ్ మిషన్‌వలన 2026 కల్లా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సాఫ్ట్‌స్కిల్స్,వ్యవస్థాపకత,పరిశ్రమలతో అనుసంధానమై సిలబస్‌ను రూపొందించడం ద్వారా పట్టభద్రులు ప్రపంచీకరణ సవాళ్లను ఎదుర్కొనేలా తయారవుతారన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2026 నాటికి క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు సుస్థిరమైన సాంకేతికతలను సమగ్రపర్చి నేషనల్ క్వాంటమ్ మిషన్ క్రింద భారతదేశంలోనే మొట్టమొదటి పూర్తిస్థాయి స్టాక్ క్వాంటమ్ వ్యాలీని స్థాపించనుందన్నారు.క్వాంటమ్‌వ్యాలీ ఏర్పాటుద్వారా అమరావతిలో ఆవిష్కరణలు, ఉన్నతస్థాయి ఉపాధి మరియు పర్యావరణ స్థిరత్వాన్ని పెంపొందించేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ఈ ప్రాజెక్ట్‌తో క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీ కండక్టర్ పరిశోధన, రక్షణ ఆవిష్కరణలను ఏకీకృతం చేయడంతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలను, సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్ట్ ద్వారా సౌర, పవన, జలశక్తి వనరులను సమర్థవంతంగా ఉపయోగించి అమరావతి నగరంపూర్తిగా పునరుత్పాదక శక్తితో నడిచే ప్రపంచంలోనే మొట్టమొదటి నగరంగా అవతరించనుందన్నారు. స్వర్ణాంధ్ర ప్రదేశ్–2047 విజన్‌ద్వారా డిజిటల్ పరిపాలన, స్టార్టప్స్, తీరప్రాంత ఆధునీకరణతో ప్రపంచాన్ని తలదన్నే మౌలిక సదుపాయాల కల్పనలో దూసుకువెళ్తుందన్నారు. విద్యార్థులు సమాజం నుండి

- తరువాయి 2లో..

## రాష్ట్ర పునర్నిర్మాణానికి ఇది తొలి అడుగు

- వైసీపీ విధ్వంస పాలన నుండి రాష్ట్రాన్ని గట్టెక్కిస్తున్న సీఎం చంద్రబాబు
- ఎమ్మెల్సీ పేరాబత్తుల, మాజీ ఎమ్మెల్యే, కో ఆర్డినేటర్ "పిల్లి" దంపతులు



**కాకినాడ రూరల్,మేజర్‌న్యూస్ :** రాష్ట్రాన్ని గాడిలో పెట్టే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు "సుపరిపాలన తొలి అడుగు" కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు

- తరువాయి 2లో..

## ఘనంగా వంగవీటి మోహనరంగా 78వ జయంతి

- కాకినాడ కొండయ్య పాలెంలో ఘన నివాళి అర్పించిన కూటమి నాయకులు
- ముఖ్య అతిథులుగా విచ్చేసిన కొండబాబు, నానాజీ, సానా సతీష్, రాజశేఖర్, తోట సుధీర్
- ఇమిడిశెట్టి వెంకటరమణ, కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు బట్టలు, అన్నదానం





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** దివంగత నేత మాజీ ఎమ్మెల్యే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి ఆంధ్ర టైగర్‌గా పేరుగాంచిన వంగవీటి మోహన రంగా 78వ జయంతి కాకినాడ కొండయ్యపాలెం శారదా దేవి గుడి సెంటర్ వద్ద రంగా మిత్రమండలి జనసేన నాయకులు ఇమిడిశెట్టి వెంకటరమణ మరియు ఆంధ్ర కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కూటమి నాయకులు సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, సివిల్ సప్లై కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్ విచ్చేసి రంగా కాంస్య విగ్రహానికి గజమాలులు వేసి జోహార్ రంగా జోహార్ జోహార్ అంటూ నినాదాలు చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాటి వంగవీటి మోహన రంగా ధైర్య సాహసాలను

- తరువాయి 2లో..

# ఘనంగా జెఎన్‌టియుకె 11వ స్నాతకోత్సవ వేడుకలు






**మొదటిపేజి తరువాయి**

ఏంలబ్ధిపొందుతారో దాన్ని దృష్టిలో ఉంచుకుని తిరిగి సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కష్టపడేతత్వం,పట్టుదల,నిర్దేశిత లక్ష్యాలతో ముందుకు సాగితే విజయం దానంతట అదే వస్తుందన్నారు.ముఖ్యఅతిథి కోట సుబ్రహ్మణ్యం (సుబు కోట) మాట్లాడుతూ సాంకేతిక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అగుమెంటెడ్ రియాల్టీల యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడంతో పాటు స్టార్టప్‌ల కోసం ఏర్పాటయ్యే ఇంక్యుబేషన్ సెల్స్ విశిష్టతను తెలిపారు.రేపటి యూనికార్న్‌లుగా మారేందుకు సొంత స్టార్టప్‌లను ప్రారంభించాలనుకునే జెఎన్‌టియుకె విద్యార్థులను ఆయన అభినందిం చారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని చేపడుతున్న పరిశోధనల ద్వారా నూతన ఆవిష్కరణ లు,ఐటి,బయోటెక్నాలజీ,ఫార్మాస్యూటికల్ రంగాలలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుం టున్నా యన్నారు.ఉపకులపతి ప్రొ.సి.ఎస్.ఆర్. కె.ప్రసాద్ మాట్లాడుతూ పరిశోధన కోసం నూతన కోణాలను అవలంభించాలని,సమాజ శ్రేయస్సు కోసం పరిశోధనా ప్రాజెక్ట్‌లను చేపట్టాలని కోరారు. పరిశ్రమ మరియు విశ్వవిద్యాలయాలకు అనుసంధానంగా పాఠ్యాంశాలు,కోర్సు రూప కల్పనలు, పరిశ్రమలలో పరిశోధనలను జాతీయ విద్యావిధానం(ఎన్ఈపి) ప్రోత్సహిస్తుందన్నారు. అమృత్ కాల్ యొక్క స్పష్టమైన విజన్‌ను రూపొందించడానికి మరియు వికసిత్ భారత్ ద్వారా 2047 నాటికి దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలిపేందుకు అందరం కలిసి పనిచేద్దామన్నారు.అనంతరం ఉపకులపతి ప్రొ.సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ గవర్నర్ మరియు ఛాన్సలర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ని శాలువాతో సత్కరించి మెమెంటోను బహూకరిం చారు. అత్యంత వైభవంగా జరిగిన జెఎన్‌టియుకె 11వస్నాతకోత్సవ వేడుకలకు రెక్టార్ ప్రొ.కెవి.రమణ వందన సమర్పణ గావించారు.ఈ స్నాతకోత్సవ వేడుకలలో భాగంగా రీసెర్చ్ స్కాలర్స్‌కు పిహెచ్‌డి అవార్డులు, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు, ఎండోమెంట్ అవార్డులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ & మేజిస్ట్రేట్ ఎస్.షన్మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాజ్‌భవన్ అధికారులు, జెఎన్‌టియుకె పాలక మండలి సభ్యులు, రెక్టార్ ప్రొ.కె.వి.రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీం ద్రనాథ్, ఓఎస్‌డి ప్రొ.డి.కోటేశ్వరరావు, డైరెక్టర్‌లు, మాజీ ఉపకులపతులు, జెఎన్‌టియుకె కళాశాలల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, విద్యావేత్తలు, జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, ప్రొఫెసర్‌లు, విభాగాధిపతులు, టీచింగ్ & నాన్ టీచింగ్ సిబ్బంది, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, పిహెచ్‌డి అవార్డు గ్రహీతలు, తల్లిదండ్రులు, ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలు డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలి



**పెనుమంట్ర,మేజర్‌న్యూస్ :** మండ లంలో వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలు ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ డి.ఈ.ఈ. కే కే డి టి వరప్రసాద్ కోరారు.శుక్రవారం స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్లో జరిగిన గృహ నిర్మాణ శాఖ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో ప్రభుత్వ పథకాలు క్రింద మంజూరు అయిన గృహాల్లో 432 మంది లబ్ధిదారుల గృహాలు వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయని, ప్రభుత్వం బీసీ, ఎస్సి గృహ లబ్ధిదారులకు అదనంగా ఇచ్చిన 50 వేల రూపాయలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.స్థానిక గృహ నిర్మాణశాఖలో ఉన్న 16 మంది ఫీల్డ్ అసిస్టెంట్స్ ఒకటి కి రెండు సార్లు విజిట్ చేసి, ఇళ్ళు పూర్తి చేయించాలని ఆయన ఆదేశించారు.ఈ సమావేశం లో మండల ఏ ఈ కే. మల్లేశ్వర రావు,ఎంపీడీఓ ఎం.ఎస్. ప్రభాకరరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.కాగా,ఈ సమావేశం జరిగిన హాల్లో పాత మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం బ్యానర్ తొలగించకుండాఅలాగే ఉంచడం పట్ల పలువురు మాట్లాడు కోవడం కొసమెరుపు.

# ఉపాధ్యాయుల కొరకు ఎస్ఎఫ్ఐ ధర్నా




**కుక్కునూరు,మేజర్ న్యూస్:** ఖాళీగా ఉపాధ్యాయులు పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్.ఎఫ్.ఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కొలికపోగు లెనిన్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉపాధ్యాయులు పోస్టులు భర్తీ చేయాలని ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో ర్యాలీగా మండల విద్యశాఖ అధికారి కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి కో.ఆర్డనేటర్ పోతురాజుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లేనిన్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అగమ్యగోచరంగా తయారైంది. కుక్కునూరు మండల వ్యాప్తంగా 32 ఎంపీపీఎస్, 11ఎంపీయూపీఎస్,3 జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో సుమారుగా 3 వేలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఇక్కడి పాఠశాలల్లో దాదాపు అందరూ పేద విద్యార్థులే ఉంటారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి 30మంది విద్యార్థులకు ఒకటీచర్ని నియమించాల్సిన ప్రభుత్వం ఇక్కడి వారిని బదిలీ చేసేటప్పుడు ఆలోచించి నిర్ణయం తీసుకోని ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని అన్నారు. ఎస్.ఎఫ్.ఐ జిల్లా పూర్వ సహాయ కార్యదర్శి యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతానికి ప్రాముఖ్యతనిచ్చిఉద్యోగులను కేటాయించాల్సింది, పోయి ఇక్కడి వారిని బదిలీ చేసింది.

ఏజెన్సీ ప్రాంతంపై నిర్లక్ష్యంతో కుక్కునూరు మండలం ఉపాధ్యాయులను నియమించలేదని. ఇప్పటికే టీచర్ల బదిలీలు ముగిశాయి.మరలా డీఎస్సీ కౌన్సెలింగ్ ప్రక్రియ చేపడితే తప్ప ఉపాధ్యాయుల నియామకం జరగదు,కాబట్టి ప్రభుత్వం వెంటనే కౌన్సిలింగ్ చేపట్టి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు స్థానాలను భర్తీ చెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.నాగేంద్రరావు, ఎస్.ఎఫ్.ఐ జిల్లా పూర్వ సహాయ కార్యదర్శి యర్నం సాయికిరణ్, ఎస్.ఎఫ్.ఐ మండల కార్యదర్శి వర్క లక్ష్మణ్, గంజి వరుణ్, పోతుల సత్యప్రవీణ్, ఏ.దిలీప్, మహేష్, జాహ్నవి, కార్తీక, అశ్విని,పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

## కాలువలు వద్ద జాగ్రత్తలు తీసుకోండి

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున కాలువలు పొంగి సమయంలో కాలువలు దాటావద్దని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఏజెన్సీ ప్రజలను కోరారు. శుక్రవారం రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలో భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా వాగులు పొంగే ప్రమాదం ఉన్నందున ఏజెన్సీలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. ఏజెన్సీ ఏడు మండలాలలోని వాగులు పొంగి సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వాగులు దాటవద్దని ఆయన తెలిపారు. ఏజెన్సీ లోను ఏడు మండలాల్లో భారీ వర్షాల కారణంగా అధికార యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## రాష్ట్ర పునర్నిర్మాణానికి ఇది తొలి అడుగు

**మొదటిపేజి తరువాయి**

ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీ ఎమ్మెల్యే,కో ఆర్డినేటర్ "పిల్లి" దంపతులు పేర్కొన్నారు. పెనుమర్తి గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నియోజక వర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో తెదేపాశ్రేణులు చేపట్టారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంహాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లి దంపతులు, శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టి కరపత్రాలు అందిస్తూ ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ ఎమ్మెల్సీ రాజశేఖరం, కోఆర్డినేటర్ పిల్లిసత్య నారాయణమూర్తి,మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిలు మాట్లాడుతూ...గత ప్రభుత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలన పూర్తిగా విధ్వంసకరంగా మారి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని వారు విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని రంగాలు నష్టపోయాయని, అభివృద్ధిఆగిపోయిందని,ప్రజల ఆత్మవిశ్వాసం కోల్పోయిందన్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి కొత్త దిశ, కొత్త ఆశ వెలుగులు కనిపిస్తున్నాయని అన్నారు. సుపరిపాలనతోపాటు ప్రజల సమస్యలు స్వయంగా ఇంటింటికీ వెళ్లి తెలుసుకుంటూ పరిష్కరించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపడుతోందని, ఇది కేవలం కార్యక్రమం కాదు... ప్రజలపై ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి ఇది తొలి అడుగు అని, ప్రతి ఒక్కరూ ఈ అభివృద్ధి యాత్రలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ రాజశేఖరం, పిల్లి దంపతులు పిలుపునిచ్చారు.

## ఘనంగా వంగవీటి మోహనరంగా 78వ జయంతి

**మొదటిపేజి తరువాయి**

గుర్తు చేశారు. రంగా పేదల కోసం బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేశారని, నేటి యువత రంగా ఆసియస్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం రంగ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సేవా కార్యక్రమాల్లో భాగంగావృద్ధులకు వస్త్రదానం,అన్నదానంకార్యక్రమాల్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల లారీ యూనియన్ అధ్యక్షులు జనసేన నాయకులు దుగ్గన బాబ్జి, సిటీ టిడిపి అధ్యక్షులు మల్లిపూడి వీరు, ఆంధ్ర కాపు సద్భావన సంఘంఅధ్యక్షులు వాసిరెడ్డి ఏసుదాసు, గౌరవ అధ్యక్షులు బసవ ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్, రాధా రంగా మిత్రమండలి నాయకులు సలాది శ్రీనివాస్ బాబు, కాపు సద్దామ సంఘం కార్యవర్గం మాధవరపు పట్టాభి రామయ్య, సలాది మూర్తి, అడపా ప్రకాష్ నాయుడు, గొల్లపల్లి లక్ష్మణరావు, గొల్లప్రోలు బాబి, బిందాన సురేష్, కూటమి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అందరూ తోడ్పడాలి

**యలమంచిలి,మేజర్ న్యూస్:** మండలంలోని కాజ జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 140 మందికి 10 వేల రూపాయలు విలువైన రాత పుస్తకాలు, పెన్నులను శుక్రవారం సాయంకాలం పాఠశాల ప్రాంగణంలో వాకర్స్ క్లబ్,పాలకొల్లు తరపున అధ్యక్షుడు తటవర్తి సుధాకర రావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రభుత్వంతో పాటు సమాజం కూడా తోడ్పాటును అందించాలని కోరారు.కార్యక్రమానికి పాఠశాల ఇంచార్జి ప్రధానోపా ధ్యాయుడు షేక్‌పీర్ సాహెబ్ అధ్యక్షత వహించగా,పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు జక్కం రాజు,వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు,సభ్యులు జవ్వాజి కల్యాణ్,కర్రికిరణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వైఖానస ఆశ్రమ కార్యవర్గ సభ్యునిగా దివి శ్రీనివాస్



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ ఆధ్వర్యంలో తిరుమల మరియు తిరుపతిలో నిర్వహించబడుతున్న వైఖానస ఆశ్రమాల కమిటీ కార్యవర్గ సభ్యునిగా కాకినాడకు చెందిన దివి శ్రీనివాసాచార్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా శుక్రవారం నగరానికి చేరుకున్న ఆయనకు శ్రీ బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘంసభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు పసుమర్తి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో దివి శ్రీనివాసచార్లను ఘనంగా సత్కరించారు. సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ వైఖానస ఆశ్రమ కమిటీకి గత మూడుసార్లుగా కార్యవర్గ సభ్యునిగా ఎన్నికవ్వడం తిరిగి వారికే అవకాశం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భక్తులకు సకాలంలో సేవలు అందించడానికి ఆకుంటితమైన దీక్షతో పని చేయడమే ఇందుకు నిదర్శనమని కొనియాడారు. తిరుమల వంటి పుణ్యక్షేత్రంలో శ్రీనివాసచార్యులు నేతృత్వంలో భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా సేవలు అందుబాటులోకి రావడం కమిటీ సభ్యులలో ఉన్న దైవభక్తిని చాటుతోందని సత్యనారాయణమూర్తి ప్రశంసించారు. తమ సంఘానికి గౌరవ అధ్యక్షులుగా శ్రీనివాసాచార్యులు వ్యవహరిస్తున్నారని వారికి ఇంతటి మహోన్నత అవకాశం రావడం తమ అందరికీ ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని చెప్పారు.

సన్మానానికి ధన్యవాదాలు తెలుపుకుంటూ శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ తిరుమల మరియు తిరుపతిలలో ఉన్న వైఖానస ఆశ్రమాలు యాత్రికులకు వసతి సౌకర్యాలు కల్పించడమే కాక కొండపైన భోజన సౌకర్యం కూడా ఏర్పాటు చేయడం ప్రధాన ఉద్దేశంగా పనిచేస్తోందని చెప్పారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఈ ఎన్నికలు జరుగుతాయని వివరిస్తూ దేశవ్యాప్తంగా సుమారు 1500 మంది సభ్యులు ఈ కమిటీలు ఉన్నారని ఆయన వివరించారు. గత మూడుసార్లుగా నాకు ఈ అవకాశం కల్పించడమే కాక తిరిగి కార్యవర్గ సభ్యునిగా సేవలు కొనసాగించా ల్సిందిగా కమిటీ భావించడం పట్ల ధన్యవాదాలు తెలుపుకుంటూ దేవుడు సేవలో నిరంతరం పనిచేయాలని అదే తమ ఆశయమని చెప్పారు. ఇంతటి గొప్ప అవకాశం రావడం భగవంతుని యొక్క అనుగ్రహంగా భావిస్తున్నానని అన్నారు. 1959లో వైఖానస ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారని నేటి వరకు ఎటువంటి అవాంతరం లేకుండా భక్తులకు గత 66 సంవత్సరాలుగా ఆశ్రమ సేవలు సకాలంలో సభ్యులు అందిస్తున్నారని శ్రీనివాసాచార్యులు చెప్పారు.కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ ముఖ్య సలహాదారులు నాగమహాశయ, పూజ నాగేంద్ర శర్మ, గౌరవ అధ్యక్షులు గరిమెళ్ళ లక్ష్మీనారాయణ శర్మ, ఉపాధ్యక్షులు కడియాల సత్యనారాయణ మూర్తి, ప్రత్యేక అతిథి ఓలేటి ఆంజనేయ శర్మతో పాటు కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ పరుశురామ్ పాల్గొన్నారు.

# అల్లూరి ఆశయాలతో ముందుకు వెళ్లాలి

**– కోనసీమ వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు జగ్గిరెడ్డి**

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** ప్రతి ఒక్కరూ అల్లూరి సీతారామరాజు ఆశయాలతో ముందుకు వెళ్లాలని కోనసీమజిల్లా వైయస్సార్‌సిపి అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు.శుక్రవారం వీరత్వం,పోరాటతత్వం కలిగిన స్వాతంత్ర సమరయోధులు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సందర్భంగా అత్రేయపురం అల్లూరి సీతారామరాజు పార్కులో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి, అల్లూరి సీతారామరాజు సెంటర్లో ఉన్న సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో చిలువూరి రామకృష్ణంరాజు, కర్రీ నాగిరెడ్డి, ముదునూరి కృష్ణంరాజు, సురేష్‌రాజు, వేగేశ్నగోపాల రాజు, గొట్టిముక్కల గోపిరాజు, నంబూరి వెంకట్రామరాజు, బసవయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 6న 13మంది పండితులచే అఖండ భాగవత ప్రవచనాలు

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రథమ ఏకాదశి నిమిత్తం ఉత్తరాది మఠాధిపతులు శ్రీసత్యాత్మ తీర్థస్వామీజీ ఆజ్ఞానుసారం ఆధ్యాత్మ విద్యా ప్రతిష్టానం ఆధ్వర్యంలో కడప ఉత్తరాది మఠం నందు ఈనెల 6వ తారీఖున ఉదయం ఎనిమిది గంటల నుండి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ ప్రవచన కార్యక్రమంలో 13 మంది సుధా పండితులు పాల్గొని అఖండ భాగవత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆధ్యాత్మి విద్యా ప్రతిష్టానం వ్యవస్థాపకులు సుధా పండితులు డాక్టర్ మాళిగి విద్యానిధి ఆచార్ తెలిపారు.భాగవత ప్రథమ స్కంధంపై పండిత జయతీర్థ ఆచార్య పగడాల, ద్వితీయ స్కంధంపై పండిత రఘు ప్రేమాచార్య, తృతీయ స్కంధంపై వేద వ్యాస ఆచార్య జోషి, చతుర్ధస్కంధంపై వాసుదేవాచార్య కానుగోవి, పంచమస్కంధంపై విజయ సింహాచార్య, షష్ట స్కంధముపై అన్విషాచార్య సరస్వతి, సప్తమ స్కంధంపై వేదేశాచార్య, అష్టమస్కంధంపై ఆనంద తీర్థ ఆచార్య, నవమస్కంధంపై ప్రసంగ చక్రవర్తి పండిద ఖేడా కృష్ణాచార్య, దశమ స్కంధ పూర్వార్ధముపై తత్వవాద మాస పత్రిక సంపాదకులు పండిత నాగేంద్ర చార్య, దశమ స్కంధం ఉత్తరార్ధముపై సులేబావి నరసింహాచార్య, ఏకాదశ స్కంధంపై లక్ష్మీనారాయణ ఆచార్య, దశమ స్కంధంపై పద్మనాభచార్య చిట్టుగుప్ప ప్రభువులు ప్రసంగిస్తారని డాక్టర్ విద్యానిధి ఆచార్య తెలిపారు.



గత నాలుగు సంవత్సరాలుగా అఖండ భాగవత ప్రవచన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని అందుకు పండిత బృందం కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రవ చన కార్యక్రమ సేవకై భక్తులు 88897956536, 93980 48813లో సంప్రదించవచ్చని డాక్టర్ విద్యార్థి ఆచార్య కోరారు. ఎంతో పవిత్రమైన తొలి ఏకాదశి నాడు భాగవత ప్రవచన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ శ్రవణం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

దేశ విదేశాలలో ఉన్న భక్తులకు వీలుగా యూట్యూబ్ ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామని తప్పక వీక్షించాల్సిందిగా ఆయన సూచించారు.

# డిప్యూటీ ఎంపీడీవోగా చిన్నబ్బులు



**ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ :** ఆత్రేయపురం డిప్యూటీ ఎంపీడీవోగా డి.చిన్నబ్బులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అల్లూరి సీతారామరాజు జిల్లా, అడ్డతీగల మండలం నుండి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. మండల అభివృద్ధికి తన అనుభవాన్ని వినియోగించుకొని సమర్థవంతంగా సేవలు అందిస్తానని డిప్యూటీ ఎంపిడిఓ అన్నారు.

# వెంకన్న ఆలయంలో వేలం పాటలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శుక్రవారం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్‌రావు ఆధ్వర్యంలో వేలంపాటలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం సెల్ ఫోన్లు, లగేజీ బ్యాగులు, పాదరక్షలు భద్రప రిచేందుకు బహిరంగ వేలం నిర్వహించారు. సెల్ ఫోన్లు భద్రపరచుటకు వేలం నిర్వహించగా ఆత్రేయపరానికి చెందిన చవాకుల లక్ష్మీ ప్రసన్న 62 లక్షలకు పాట దక్కించుకున్నారు. అలాగే లగేజ్ భద్రపరచుటకు వేలం నిర్వహించగా సిద్ధాంతానికి చెందిన గాజుల దుర్గారావు రూ.5 లక్షలకు పాట దక్కించుకున్నారు. అలాగే పాదరక్షలు భద్రపరిచేందుకు వేలం నిర్వహించగా తెలంగాణకి సూర్యాపేట చెందిన కే.శ్రీనివాస్ రూ.6 లక్షల 626కి పాట దక్కించుకున్నారు.

## డిగ్రీ కళాశాలలో ఘనంగా 'అల్లూరి' జయంతి



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ ఆధ్వర్యంలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుధ, పూర్వ విద్యార్థులు పింజర్ల వీరభద్ర రావు, శ్రీనివాసరావు అల్లూరి విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుధ మాట్లాడుతూ విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంత గిరిజనుల కోసం, వారి హక్కుల కోసం పోరాడి తన ప్రాణాలను సైతం అర్పించారని, ఆ మహనీయుడిని మనం ఎల్లవేళలా స్మరించుకోవాలన్నారు.కళాశాల పూర్వ విద్యార్థులు కళాశాలలో వారు చదువుకున్నప్పటి రోజులు స్మరించుకుంటూ ప్రస్తుత విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు జీవితం గురించి వివరించడం జరిగింది. అల్లూరి జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని కళాశాలలో వ్యాస రచన, వక్తృత్వం పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రెసిడెంట్ పింజర్ల నాగ వీరభద్రరావు మాట్లాడుతూ ఇటీవల కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయిందని, పూర్వ విద్యార్థులు చాలామంది ఈ అసోసియేషన్ లో మెంబర్ షిప్ తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐటీడీఏలో విప్లవ వీరునికి ఘన నివాళి



రంపచోడవరం, మేజర్ న్యూస్ : భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ వారిపై పోరాటం చేసిన విప్లవ వీరుడిని గుర్తుంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని పురస్కరించుకొని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారిని భారతదేశం నుండి తరిమి వేసే విధంగా గిరిజన ప్రాంతాల్లోని గిరిజనుల సహాయంతో బ్రిటిష్ వారిపై పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు ను దేశ ప్రజలంతా గుర్తుంచుకోవాలని అన్నారు. అల్లూరి సీతారామరాజు ఎక్కువగా గిరిజన ప్రాంతంలోనే ఉండి బ్రిటిష్ వారిపై పోరాటం చేయుటకు ఈ ప్రాంత గిరిజనులతో సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

బ్రిటిష్ కాలంలో ఏజెన్సీ ప్రాంత పోలీస్ స్టేషన్లపై అల్లూరి సీతారామరాజు దాడి చేసారని ఆయన తెలిపారు. అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంత గిరిజనులతో మమేకమై బ్రిటిష్ వారిని గడగడ లాడించిన ఏకైక వీరుడని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జులై 4వ తేదీ 1897 సంవత్సరంలో జన్మించారని ఆయన తెలిపారు. అల్లూరి సేవలకు గుర్తింపుగా అల్లూరి పేరు ఈ జిల్లాకు నామకరణం జరిగిందన్నారు. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఏపీఓ జనరల్ డి.ఎన్.వి.రమణ, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, పిహెచ్ఓ దేవదానం, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కృష్ణమోహన్, జల్లి శంభుడు, మండల విద్యాశాఖ అధికారులు ఎమ్మెస్ నారాయణ, తాతబ్బాయి, గిరిజన సంక్షేమ శాఖ సూపరింటెంట్ బి కిషోర్, రాజారెడ్డి, ప్రధానోపాధ్యాయులు యం.కరుణ విలాస్, ప్రసాద్, ఎస్ఓ మార్తమ్మ, ఐటీడీఏ మేనేజర్ బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, చక్రధర్, రాజన్ పుష్పాలతో నివాళులర్పించారు.

# సర్పంచ్ వార్డు మెంబర్ల ఫిర్యాదుపై విచారణ

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** మండల కేంద్రం ఆత్రేయపురం గ్రామపంచాయతీలో అధికార పార్టీకి చెందిన ఒక వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా పలు అక్రమాలకు అన్యాయలకు పాల్పడుతున్నారంటూ వచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం జిల్లా అధికారులు డిఎల్‌పిఓ రాజు విచారణ జరిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ విచారణలో గ్రామ సర్పంచ్ గెడ్డం సుధా, వార్డు మెంబర్లు పంచాయతీలో జరుగుతున్న అవకతవకలపై అధికారులకు వివరించారు. గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా ఇంజనీరింగ్ అధికారులు ఎస్టిమేట్‌లు తయారు చేయడంతోపాటు 46 లక్షల రూపాయల వరకు పనులు చేపట్టడంపై గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ ముదునూరి విష్ణుకుమార్ రాజు. పాలకవర్గం సభ్యులు కె.రమణ, యాలంగి చిన్న సత్యనారాయణ, వి.శిరీష, ఎం.రాజంరాజు, రామకృష్ణంరాజు, ఆర్.జానీ లు గత నెల 23న జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన విచారణలో గ్రామ సర్పంచ్ వార్డు సభ్యులు అధికారులకు పాలకవర్గం ప్రమేయం లేకుండా జరుగుతున్న అక్రమాలపైన పనులు చేపట్టడంపైన ఇంజనీరింగ్ అధికారులు పంచాయతీ తీర్మానానికి



విరుద్ధంగా ఎస్టిమేట్లు తయారు చేయడం, క్వాలిటీ కంట్రోల్ అధికారులు నాణ్యత ప్రమాణాలు సరిచూడకపోవడం తదితర అవకతవకలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. విచారణలో గ్రామ సర్పంచ్ వార్డ్ మెంబర్లు తీసుకొచ్చిన అంశాలపై నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి అందిస్తామని అధికారులు తెలిపారు. విచారణలో గ్రామ కార్యదర్శి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### – ఐటీడీఏ పిఓ కట్టా సింహాచలం



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సూచించారు. శుక్రవారం రంపచోడవరం మండలం పెద్ద గెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రాజెక్ట్ అధికారి సింహాచలం పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంతమంది వైద్యాధికారులు ఉన్నది, ఎంతమంది సిబ్బంది ఉన్నది, ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నది, ఎంతమంది బాలింతలు ఉన్నది అదేవిధంగా ప్రతిరోజు ఎంతమంది పేషెంట్లు వస్తుంది ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి సింహాచలం మాట్లాడుతూ సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎవరైనా జ్వరాలతో వచ్చిన వారికి వెంటనే రక్త నమునాలు స్వీకరించి వ్యాధులకు మందులు అందజేయాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆనెంపల్లి గ్రామాన్ని ప్రాజెక్ట్ అధికారి సందర్శించి గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధుల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని, అదేవిధంగా ఎవరికైనా జ్వరాలు ఉంటే వెంటనే దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలన్నారు. తమ గ్రామంలో మంచినీరు బాగోలేదని మంచినీరు ఏర్పాటు చేయాలని ప్రాజెక్ట్ అధికారి దృష్టికి గ్రామస్తులు తీసుకురాగా వెంటనే ప్రాజెక్ట్ అధికారి స్పందించి త్రాగునీరు టెస్టింగ్ చేయించడం జరుగుతుందన్నారు. అనంతరం రంపచోడవరం గ్రామంలోని పాత ఆంధ్ర బ్యాంకు సమీపంలోని అంగన్వాడి కేంద్రాన్ని ప్రాజెక్ట్ అధికారి పరిశీలించడం జరిగింది. ఈ అంగన్వాడి కేంద్రంలో ఎంతమంది బాలబాలికలు ఉన్నది ఆయన ఆరా తీశారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలోని బాల బాలికలకు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ప్రతిరోజు ఆహార పదార్థాలు పెట్టాలని, అదేవిధంగా బాల బాలికలకు ఆటపాటలతో విద్యను బోధించాలన్నారు. ప్రాజెక్ట్ అధికారి వెంట అడిషనల్ డి అండ్ హెచ్ఓ జి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

## దేశం సుపరిపాలనపై అవగాహన సదస్సు



**చింతూరు, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం రంపచోడవరం నియోజకవర్గ శాసనసభ్యురాలు మిరియాల శిరీష భాస్కర్ ఆదేశాల మేరకు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై బూత్ యూనిట్ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి బూత్ లోని బూత్ సభ్యులు డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ప్రతిరోజు 50 ఫోటోలు అప్లోడ్ చేసి టెలిగ్రామ్ బాట్‌లోని మై టిడిపి యాప్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. ఈ నెల రోజులపాటు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ పని మన పనిగా భావించి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మండలంలో విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఇల్లా చిన్నారెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ ఓబిల్లనేని నరసింహారావు, కో క్లస్టర్ పొదిలి రామారావు, నాయకులు మల్లెల వెంకటేశ్వరరావు, యూనిట్ ఇంచార్జ్‌లు ముత్యాల శ్రీరామ్మూర్తి, శీలం తమ్మయ్య, బూత్ ఇన్చార్జి లు తదితరులు పాల్గొన్నారు.

## వంగవీటి మోహన్ రంగా విగ్రహానికి చిర్ల జగ్గిరెడ్డి నివాళులు



రావులపాలెం, మేజర్ న్యూస్ : మహనీయులు వంగవీటి మోహన్ రంగా 78వ జయంతి సందర్భంగా గోపాలపురం సెంటర్లో వంగవీటి మోహన్ రంగ విగ్రహం వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గోపాలపురం సెంటర్లో గల జననేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీం 'నేను సైతం' సేవలు మరువలేనివి

### - సర్పంచ్ మెర్ల రాము



ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందిస్తూ టీం నేను సైతం సభ్యులు అందిస్తున్న సేవలు మరువలేనివి సర్పంచ్ మెర్ల రాము అన్నారు. శుక్రవారం ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం కోలుకున్న రంకిరెడ్డి దుర్గాప్రసాద్ కు టీం నేను సైతం వ్యవస్థాపక అధ్యక్షుడు అంబటి కిషోర్ ఆధ్వర్యంలో సభ్యులు 10,200 రూపాయలు ఆర్థిక సాయం అందించారు. గ్రామ సర్పంచ్ మెర్ల రాము చేతులమీదుగా ఆర్థిక సాయం అందించే కార్యక్రమంలో టీం నేను సైతం సభ్యులతో పాటు గ్రామ నాయకులు రంకిరెడ్డి అశోక్, రంరెడ్డి వినయ్, పువ్వల పాలరాజు, మెర్ల సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజవొమ్మంగి నుండిబొరుగుపల్లి రహదారి నిర్మించాలి

– గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్



**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** రాజవొమ్మంగి నుండి బూరుగుపల్లి, వయ్యాడు వెళ్లే ప్రధాన రహదారి నిర్మించాలంటూ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు శ డిమాండ్ చేశారు. శు క్రవారం లోతా రామారావు బొరుగుపల్లి,వైయ్యాడు గ్రామ గిరిజనులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను గిరిజనలు లోతా రామారావు దృష్టికి తీసుకువచ్చారు.ఈ మేరకులోతా రామారావు మాట్లాడుతూ. మారుమూల గ్రామమైన బొరుగుపల్లి వెళ్లాలంటే రహదారి సక్రమంగా లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.రాజవొమ్మంగి నుండి వయ్యాడు బూరుగుపల్లి వెళ్లే ప్రధాన రహదారి రాళ్లు పైకి లేచిపోయి రహదారి బురదమయంగా మారిందని వీరు తమ అవసరాల నిమిత్తం రాజవొమ్మంగి ప్రధాన కేంద్రానికి రావాలంటే వర్షాకాలంలో అత్యవసర పరిస్థితుల్లో గిరిజనులు బయటకు రాని పరిస్థితి నెలకొందన్నారు.ఇటీవల రహదారి కొంతమేర తూతూ మంత్రంగా వేసి మధ్యలోనే వదిలేశారని ఈ రహదారి దేనికి చెందకుండా పోయిందని అనేకమార్లు సంబంధిత అధికారులకు,తెలిపిన ప్రయోజనం లేకపోయిందన్నారు. గ్రామంలో సరైన వీధి రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ లేదని గ్రామం అభివృద్ధి ఆమడ దూరంలో ఉందని తక్షణం ఉన్నతాధికారుల స్పందించి రహదారి సమస్యతో బాటు గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.తమ సమస్యలు పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధం కావాలని గిరిజనులకు రామారావు పిలుపునిచ్చారు.

# అల్లూరి స్ఫూర్తితో కార్మిక హక్కులు కాపాడుకుందాం

– జూలై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి



**కాకినాడ రూరల్,మేజర్‌న్యూస్ :** స్వాతంత్ర సమరయోధులు, మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సభకాకినాడ రూరల్ వలసపాకల, సుందరయ్య కాలనీ సిఐటియు కార్యాలయంలో నిర్వహించడం జరిగింది.ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి సిఐటియు కాకినాడ రూరల్ కన్వీనర్ టి.రాజా, కో–కన్వీనర్ అంబటి రామకృష్ణ పూలమాలేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా టి.రాజా మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో కార్మిక హక్కులు కాపాడుకుందాం అన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా గిరిజనులు హక్కుల కోసం రాజీలేని పోరాటం చేసిన వీరుడు అల్లూరి అన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం కార్మికులు సంబంధించిన 44 చట్టాలను అత్యంత దారుణంగా తొలగించేస్తుందన్నారు. బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నేడు మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చేస్తుంది అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జులై 9వ తేదీన జరుగుతున్న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో అల్లూరు స్ఫూర్తితో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు పరిశ్రమ కార్మికులు నూకరాజు, సింహాద్రి, రాంబాబు, పంతాడి నూకరాజు, సింహాద్రి, రామ కృష్ణ, సాల్మన్ రాజు, నీలయ్య, చంద్రశేఖరు, అప్పలరాజు, నాగేంద్ర, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం



**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** కాకినాడ జేఎన్టీయూ 11వ స్నాత్సకోత్సవంలో పాల్గొనేందుకు శుక్రవారం ఉదయం విజయవాడ గన్నవరం ఎయిర్ పోర్ట్ నుంచి బయలుదేరిన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కాకినాడ పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు.

ఈ సందర్భంగా ఆయనకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎస్పీ జి.బిందు మాధవ్, కాకినాడ కమిషనర్ భావన, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఎంపీ సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, జేఎన్టీయూ వీసీ డా.సీ.ఎస్.ఆర్కే.ప్రసాద్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, ఏఎస్పీ మానిష్ పాటిల్ దేవరాజ్, ట్రైనీ కలెక్టర్ మానీషా, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లి బాబు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన జేఎన్టీయూ అతిథి గృహానికి చేరుకున్నారు. తదపరి మధ్యాహ్నం మూడు గంటలకు యూనివర్సిటీ అలుమినీ హాలులో జెఎన్టీయు–కాకినాడ 11వ స్నాతకోత్సవంలో గవర్నర్ పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చిన టిడిపి ప్రెసిడెంట్ పండూరి అప్పారావు, జనసేన నాయకులు విజ్జిన శివ



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ఉదయం రాజీవ్ కాలనీలో పంచాయితీ కార్యదర్శి జి.వెంకటరావు, టిడిపి ప్రెసిడెంట్ పండూరి అప్పారావు,జనసేన నాయకులు విజ్జిన శివ నాయకత్వంలో పర్యటించడం జరిగింది. ఈసందర్భంగా స్థానిక ప్రజలతో పంచాయితీ కార్యదర్శి జి. వెంకటరావు మాట్లాడుతూ కాలనీలో అన్ని వీధులకు మంచినీటి కుళాయిలు 15 రోజుల్లో వేయిస్తానని చెప్పారు. వీధి లైట్లు వెంటనే రిపేర్ చేయిస్తాను అన్నారు. పండూరి అప్పారావు మరియు విజ్జిన శివలు మాట్లాడుతూ కరెంట్ వైర్ల కోసం ఎలెక్ట్రికల్ ఏ.ఈ గారితో మాట్లాడాను తొందర్లో కరెంటు వైర్లు మారుస్తారని చెప్పారన్నారు. రేషన్ షాపుని వచ్చే ఆగష్టు నెల నుండి మీ కాలనీలో అందుబాటులో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ పర్యటన కార్యక్రమంలో టిడిపి నాయకులు విజ్జిన రాజశేఖర బాబు, దొడ్డి బాబ్జి,కురసాల ప్రసాద్,వినోద్,బాలాజీ, దాము, జనసేన నాయకులు ఎన్ భీమేశ్వర రావు పాల్గొన్నారు.

# అల్లూరి జీవితం నేటి యువతకు ఆదర్శం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** అల్లూరి జీవితం నేటి విద్యార్థులకు ఆదర్శమని యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ అన్నారు. పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 122వ జయంతి సందర్భంగా విద్యార్థులకు 4 రోజుల పాటు పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహించి, పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం యాసలపు సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. దీనిలో భాగంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# మహోజ్వల శక్తి అల్లూరి సీతారామరాజు

– డాక్టర్ బిఈవిఎల్ నాయుడు



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలు నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడ మిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు.

ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను తరిమి కొట్టవచ్చునని నమ్మి, అది ఆచరణలో పెట్టిన మహనీయుడు, గిరిజన సైన్యంతో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు నడిపిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలను ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామ రాజు చిత్రపటానికి డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు పూల మాలలు వేసి నమస్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాలతో పోరుబాటలో నడిచిన మార్గదర్శకులు, పోరాట పటిమకు, దేశభక్తికి నిలువెత్తు రూపం అల్లూరి సీతారామరాజు అని అన్నారు. భారత స్వాతంత్ర పోరాటంలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని ప్రశంసించారు.ఇటువంటి మహనీయులు విద్యార్థులకు మార్గదర్శకులు

# రీజినల్ జిల్లా పాస్టర్స్ కోఆర్డినేషన్ సమావేశం



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** క్రైస్తవులు శాంతికాముకులని ఏసుక్రీస్తు ఎంచుకున్న శాంతి ప్రేమ కరుణ మార్గంలోనే తాము నడుచు కుంటున్నామని ప్రపంచ శాంతిని నెలకొల్పడమే క్రైస్తవులై లక్ష్యమని ఏనాడు కూడా హింసనుగాని పర మతాన్ని కించపరచడం గాని ఎప్పటికీ తమ ఉద్దేశాలు కావని పాస్టర్స్ రీజినల్ చైర్మన్ జాన్ బాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని రావులపాడు గ్రామంలో ఉన్న హెూలీ టెంపుల్ ప్రార్థన మందిరం నందు జిల్లా మరియు రీజినల్ పాస్టర్స్ అసోసియేషన్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. పాస్టర్ జాన్‌బాబు అధ్యక్షుడు జరిగిన ఈ సమావేశంలో జిల్లాకు చెందిన పలువురు సేవకులు పాస్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ శాంతిని నెలకొల్పుతూ సువార్తను ప్రకటించడమే తమ లక్ష్యం అని అదే సమయంలో ఏ మతమును గాని ఏ కులములు గాని దూషించడం కానీ ద్వేషించడం కానీ జరక్కుండా ముందుకు తీసుకువెళ్లడమే క్రైస్తవుల ఉద్దేశమని ప్రపంచంలో ఎక్కడా కూడా భారతదేశంలో కూడా క్రైస్తవులు దాడి చేసిన సంఘటన ఎక్కడ లేవని కానీ దురదృష్టవశాత్తు ఇటీవల కాలంలో అక్కడక్కడ క్రైస్తవ మత బోధకులపై దాడులు జరపడం చూడనీయమని వారు పేర్కొన్నారు. నేటి దినాల్లో పాస్టర్స్ అందరు ఐకమత్యంతో ముందుకు కొనసాగుతూ సేవే లక్ష్యంగా శాంతి సమాజమే తమ సంకల్పంగా పరమతాన్ని గౌరవిస్తూ ముందుకు వెళ్లాలని వారు తెలిపారు. క్రైస్తవ బాలికలపై క్రైస్తవ సంఘాలపై అక్కడక్కడ జరుగుతున్న దురదృష్టకర సంఘటనలను ఖండిస్తూ ప్రభుత్వాలు అటువంటి దాడులు జరగకుండా రక్షణ కల్పించాలని వారు కోరారు. భారతదేశానికి క్రైస్తవ సువార్త అనేది మొదటి శతాబ్దంలో వచ్చిందని సువార్తతోపాటు బ్రిటీష్ కాలం నుండి కూడా సేవలను కూడా నెలకొల్పారని పలువురు వ్యక్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ సెక్రటరీ పాస్టర్ సువర్ణరాజు, జిల్లా ఉపాధ్యక్షులు రెవరెండ్ పి.అమృతరావ్, దైవజనులు జయరాజు, ఎన్నోస్ పాల్, ఇతర మండల అధ్యక్షులు దైవ సేవకులు పాల్గొన్నారు.

## అల్లూరికి ఘన నివాళి- పాల్గొన్న ఆర్డీఓ



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం విప్లవ వీరుడు, మన్యం జ్యోతి అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె.శ్రీరమణి పాల్గొని మాట్లాడుతూ అల్లూరిని నేటి యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. దీనికి ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిటి భానుకుమార్, నారాయణ, ఆనంద్, రమేష్‌కుమార్, విజయ్ కుమార్, ప్రకాష్, ప్రసాద్, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నీటి తీరువా వసూళ్ళకు ప్రత్యేక డ్రైవ్

### - తహశీల్దార్ వెంకటలక్ష్మి



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండలంలో నీటి తీరువా వసూళ్ళకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తహశీల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ రైతులు నీటి పన్నును అన్ని గ్రామ సచివాలయాలలో చెల్లించి రసీదును పొందాలని, పేర్కొన్నారు. పెద్దాపురం మండలంలో ఒక కోటి 51 లక్ష 38వేల 116 లకు గాను ఇప్పటివరకు 10 లక్షల 5వేలు వసూలు చేయడం జరిగిందని, కావున త్వరితగతిన రైతులు నీటి తీరువాను సచివాలయాలలో చెల్లించాలని, దీనికి సంబంధించి ఆయా గ్రామాల వీఆర్వోల ద్వారా డిమాండ్ నోటీస్‌లు జారీ చేయడం జరిగిందని తహశీల్దార్ తెలిపారు.

## గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్ష - పాల్గొన్న పిడి



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయం నందు శుక్రవారం గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్ష సమావేశం జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.వి.వి.సత్యనారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. అలాగే మండలాల వారీగా గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ డి.శ్రీలలిత, హౌసింగ్ ఏఇలు ఓ.శ్రీనివాస్, అత్తిలి ప్రసాద్, ఎపిఎం సూర్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు లక్ష్మణ్, శ్రీరామ్, ఈశ్వరుడు, సిసిలు, పలు శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సర్వసభ్య సాధారణ సమావేశం



**కాకినాడ రూరల్,మేజర్‌న్యూస్ :** కాకినాడ రూరల్ మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సాధారణ సమావేశంరూరల్ ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి త్రిమూర్తులు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ 2025-26వ సంవత్సరం వార్షిక బడ్జెట్‌పై ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు వెళ్ళటానికి సమావేశం నిర్వహించుకోవడం జరిగిందన్నారు. మద్యం బెల్ట్ షాపుల రహిత గ్రామాలగా తీర్చిదిద్దాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులకు సూచనలు సలహాలు చేశారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామాలలో పారిశుద్యం, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరారు. త్రాగు నీటి ఎద్దడి లేకుండా ప్రజలకు సరఫరా చెయ్యాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్ర మంలో మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రంగా 78వ జయంతి

### - పేదలకు పండ్లు, దుప్పట్లు అందజేత



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** పేద ప్రజల గుండె చప్పుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి విజయవాడ మాజీ శాసనసభ్యులు వంగవీటి మోహన రంగా 78వ జయంతిని పురస్కరించుకుని రావులపాలెంలో శు క్రవారం ప్రజా సేవకులు.శ్రీ కృష్ణదేవరాయ కాపు సంఘం అధ్యక్షులు, సీనియర్ రాజకీయ నాయకులు నందం వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమంలో కాపు ఉద్యమ నేత, తెలుగురైతు రాష్ట్ర ప్రధానకార్యదర్శి, అనపర్తి నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు ఆకుల రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని రావులపాలెంలోని అమలాపురం వెళ్లే రోడ్డులో ఉన్న వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అభిమానులు, నాయకులు నివాళులు అర్పించి జోహార్లు తెలిపారు. అనంతరం ఆకుల నందం చేతులమీదుగా నిరుపేదలకు వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వంగవీటి మన మధ్య భౌతికంగా లేకపోయిన నిత్యం ప్రజల హృదయాల్లో స్థిరస్థాయిగా బ్రతికే ఉన్నారన్నారు. పేదల ఇళ్ల పట్టాల కోసం అలుపెరుగని పోరాటం చేసి అమరణ దీక్షకు పూనుకుని సమాజం కోసం పోరాడిన ప్రజానేత మోహన రంగా అని ఆకుల అన్నారు. జనం కోసమే నేను ఉన్నానంటూ ముందుకొచ్చిన ఆయన సంకల్పాన్ని ప్రజా ఆదరణ, ఎదుగుదల చూసి ఓర్వలేని కొందరు ఆయన్ని పొట్టనపెట్టుకున్నారన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం సాగించిన మహనీయుడు వంగవీటి చరిత్రలో నిలిచిపోయారన్నారు. సమాజంలో పేద ప్రజల కోసం నిలబడ్డ ఆయన చరిత్ర గురించి నేటి యువత తెలుసుకుని ప్రజా సేవలో మంచి మార్గంలో ముందుకు సాగుతు రంగాను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన నందం సత్యనారాయణను, సంఘం పెద్దల్ని, యువతను రామకృష్ణ అభినందించారు.

ఈ కార్యక్రమంలో సాధనాల శ్రీనివాస్ (నెంబర్ వన్ శ్రీను), నందం సూర్యనారాయణ (సూరిబాబు), సిద్దిరెడ్డి శ్రీనివాస్, విళ్ళ రాము, పసుపులేటి రాధాకృష్ణ, కోట చంద్రశేఖర్, అంబటి కిషోర్, గీదా వెంకటేష్, ఆకుల స్వామినాయుడు, గంధం వెంకటేష్, గుర్రాల మోహన్, పలువురు నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కొమరాపురంలో సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించిన పోలీసులు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని కొమరాపురం గ్రామంలో సైబర్ క్రైమ్స్ , బాల్య వివాహాలపై పోలీసులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనంపై ఇద్దరు మించి ప్రయాణించ రాదని హెల్మెట్ టు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిని వాహన రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని ఎస్సై చిన్న బాబు అన్నారు. గ్రామంలో అసాంఘిక కార్య కళా పాలకు పాల్పడరాదని గంజాయి పండించిన ట్రాన్స్పోర్ట్ చేసిన చట్టరీత్యా నేరమని తెలిపారు. అలానే నాటు సారా తయారు చేయడం, అమ్మడం వంటి చర్యలు చేయరాదు అన్నారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల వైపు దృష్టి పెట్టాలి అన్నారు. క్రీడల వల్ల మానసి కొలాసం కలిగి చదువుల్లో రాణించవచ్చు అన్నారు. ఆన్లైన్ గేమ్స్, ఆన్లైన్ అప్పులు తీసుకోవడం వల్ల , బాల్యవాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలు వివరించారు.

# జర్నలిస్ట్‌లకు ఫెన్షన్ విధానం అమలు చేయాలి

– మీడియా కమీషన్ ఏర్పాటు చేయాలి

– ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** దేశంలోని 14 రాష్ట్రాలలో జర్నలిస్ట్‌లకు పెన్షన్ విధానం అమలవుతున్నా రెండు తెలుగు రాష్ట్రాలలో పెన్షన్ అమలుకు కార్యరూపం దాల్చడంలేదని, పెరిగిన మీడియాకు అనుగుణంగా మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. కాకినాడ యుటిఎఫ్ హోంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కాకినాడ జిల్లా కమిటీ సమావేశం కాకినాడ జిల్లా అధ్యక్షులు వాతాడ నవీన్ రాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన మాట్లాడుతూ జూన్ 9, 11 తేదీలలో జర్నలిస్టుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రకాలుగా ధర్నాలను నిర్వహించామన్నారు. జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందని, అలాగే జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు, అక్రిడేషన్ల వంటి సమస్యలపై ఆందోళనలు చేపట్టామని చెప్పారు. వీటిపై సమాచార శాఖ మంత్రిని కలిసి సుదీర్ఘంగా చర్చించామని, దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. సచివాలయంలో జర్నలిస్టు సంఘాల అన్నింటితో ఒక సమావేశం ఏర్పాటు చేసి విధివిధానాలు రూపొందిస్తామని తెలియజేశారన్నారు. జర్నలిస్ట్‌లకు ఇళ్ళ స్థలాలపై ప్రస్తుత ప్రభుత్వం ఇంటి స్థలంతోపాటు ఇల్లును కట్టించే ప్రయత్నంపై కసరత్తు చేస్తుందని మంత్రి తెలియజేశారన్నారు. అలాగే ఇటీవల కాలంలో వివిధ ప్రమాదాలకు గురైన ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వం కలిగిన జర్నలిస్టులకు ఆర్థిక సహాయ చెక్కులను ముఖ్యఅతిథి చేతుల మీదుగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వాతాడ నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్, ఫెడరేషన్ మాజీ అధ్యక్షులు అల్లుమల్లు ఏలియా, జిల్లా ట్రెజరర్ రామకృష్ణ, రాష్ట్ర సభ్యులు ఎండి అధికార్, మున్నీ, మట్టపర్తి శ్రీనివాస్, శ్రీహరి, జిల్లా కమిటీ సభ్యులు బాబి, సత్తిబాబు, జి. శోభన్, డి.శ్రీధర్, బాబురావు, మల్లేశ్వరరావు, రాజు, వల్లూరి నానాజీ, పుర్రె త్రినాథ్, సత్య, రెడ్డి, స్టాలిన్, లోవరాజు, ప్రవీణ్, రాము, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం సూపర్ పాలన అందించింది

– ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు అధికారం చేపట్టిన సంవత్సరకాలంలో రాష్ట్రంలో సూపర్ పాలన అందించారని ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. శుక్రవారం ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో మూడు నాలుగు వార్డుల్లో ఆమె ముందడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సర్పురం మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పదం వైపు నడిపించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని, సంక్షేమం ఒకవైపు అభివృద్ధి మరోవైపు రెండు కళ్ళుగా ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపిస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు రూపొందించారు అన్నారు. సంవత్సరంలో సాధించిన విజయాలను ప్రజల ముందు ఉంచేందుకే ఈ ముందడుగు కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి గానీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వ యంత్రాంగం గాని ప్రజల ముందుకు వెళ్లేందుకు శాసన చేయలేదన్నారు. ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలోని పర్యటించిన ఎమ్మెల్యేకు మహిళలు ఘన స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అలమండ చలమయ్య బొద్దిరెడ్డి గోపాలకృష్ణ,మూది నారాయణస్వామి కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యం



– ఏడాది సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**గండేపల్లి,మేజర్‌న్యూస్ :** గండేపల్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమయ్యేలా ప్రారంభించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని జగంపేట శాసన సభ్యులు జ్యోతుల నెహ్రూ స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఆయన గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం ఏడాది సుపరిపాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, చేయవలసిన కార్యక్రమాలు వివరిస్తూ ప్రజాభిప్రాయం తెలుసుకుంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయం లేని పాలన ఉండకూడదని. ప్రజల సమస్యలు విని, పరిష్కరించే ప్రక్రియకు ఇది మొదటి మెట్టు అని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్ళి పెన్షన్లు, రేషన్ పంపిణీ, విద్యుత్ సరఫరా, నీటి సమస్యలు తదితర అంశాలపై ప్రజల ఫిర్యాదులు స్వీకరిస్తామని విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధులు, మహిళలు, యువత అందరితో ముచ్చటించి వారి అభిప్రాయాలు నమోదు చేసుకుంటామని అన్నారు. పాలనలో ప్రజల భాగస్వామ్యం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం తమ పాలనలో ప్రజలను భాగస్వాములుగా చేర్చాలని సంకల్పించిందని అన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి, అధికారుల సమక్షంలో ప్రజల ఫిర్యాదులను నేరుగా విని, తక్షణ స్పందన ఇవ్వడం వల్ల ప్రభుత్వంపై ప్రజల నమ్మకం మరింత బలపడుతోందని జ్యోతుల నెహ్రూ ప్రజా సమస్యల పరిష్కారం నియోజక వర్గ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, కొత్త కొండబాబు,జాస్తి వసంత్, పాలచర్ల సత్యనారాయణ, సర్పంచ్ శిల మంతుల వీరబాబు,దాపర్తిసీతారామయ్య,కోంద్రు అప్పల రాజు, ముంద్రు వాసు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చడమే లయన్స్ క్లబ్ లక్ష్యం

– నూతన అధ్యక్షులు శ్రీనివాసరావు



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** పేద ప్రజల లక్ష్యంగా పెట్టుకొని భోజనం లేని నిరుపేదలకు ఆకలి తీర్చాలని లక్ష్యంతో పనిచేస్తున్నట్లు భీమేశ్వర లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులు అమలకంటి శ్రీనివాసరావు పేర్కొన్నారు.శుక్రవారం శ్రీ భీమేశ్వర లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరంతరాయంగా భోజనం లేక నిరాశ్రయులుగా ఉన్న నిరుపేద వృద్ధులకు వారి ఇంటి వద్దకే భోజన కార్యక్రమం లైన్స్ క్లబ్ నూతన అధ్యక్షులు హోదాలో అమలకంటి శ్రీనివాసరావు ప్రారంభించి భోజనాలు అందజేసినారు,ఈకార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు వేగి సత్యనారాయణ, నల్ల చక్రధర పాల్గొన్నారు.

# పి.వేమవరంలో యువకుడు దారుణహత్య



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మండలం పి.వేమవరం కిరణ్ కార్తీక్ అనే యువకుడు దారుణ హత్య కలకలం రేపింది. ఓ యువతితో నడిపిన ప్రేమ వ్యవహారమే హత్యకు దారీ తీసింది. అదే గ్రామానికి చెందిన కృష్ణ ప్రసాద్ సోదరితో ప్రేమ వ్యవహారం నడుపుతున్నాడనే కోపముతో కార్తీక్‌ను గత నెల 24 వ తేదీన రాత్రి పార్టీకి అని పిలిచి పి.వేమవరం పక్కనే ఉన్న బ్రహ్మానందపురం గ్రామంలో ఉన్న ఒక లేఅవుట్లో స్నేహితుని సహాయంతో కిరణ్‌ను గొంతు నులిమి హత్య చేసి శవాన్ని అక్కడే మట్టి గుట్టల మధ్య పాతి పెట్టి అక్కడి నుండి పరారయ్యారు. పది రోజుల తరువాత నిందితులు భయంతో స్థానిక వీఆర్వో దగ్గర లొంగిపోవడంతో పోలీస్‌లు నిందితులను అరెస్ట్ చేసి ఘటన స్థలానికి తీసుకు వెళ్లి కిరణ్ మృతదేహాన్ని వెలికి తీసి అక్కడే పంచనామ నిర్వహించారు. అనంతరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ భగవాన్ మృతుని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# జగనన్న కాలనీ వాసులకు ఎన్నాళ్లు ఈ అవస్థలు

– బీఎస్పీ ఇంచార్జి జుత్తుక



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట జగనన్న కాలనీ వాసులకు ఎన్నాళ్ళు ఈ అవస్థలు అని బహుజన్ సమాజ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి, కాకినాడ జిల్లా కమిటీ అడ్వైజర్ జుత్తుక నాగేశ్వరరావు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన గురుకుల పాఠశాలకు, జగనన్న కాలనీకి వెళ్ళే రోడ్డును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీ వాసులు రాకపోకలకు ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం మేము ఇన్ని కిలోమీటర్లు సీసీ రోడ్డు వేశామని ఆర్భాటాలు చేస్తుందన్నారు. మరి ఈ కాలనీ రోడ్డు మార్గం ఇలా ఎందుకు ఉందని మండిపడ్డారు. ఇది ప్రజలు ఉండే కాలనీ కదా అని ప్రశ్నించారు.కూటమి ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు, అధికారులు గురుకుల, జగనన్న కాలనీకి వెళ్ళే రోడ్డును వెంటనే నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

# 700 వందల మంది విద్యార్థినీలకు మూడు టాయిలెట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నిదర్శనం

**- ఆదివాసి గిరిజన సంఘం - ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు**



**కూనవరం, మేజర్ న్యూస్ :** మండలంలోని కోతుల గుట్ట గ్రామంలోని గురుకులాన్ని ఎంపీటీసీ జయసుధ ఆధ్వర్యంలో సందర్శించి అక్కడున్న విద్యార్థులతో మాట్లాడారు. గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకులాన్ని చుస్తే 'మేడి పండు 'సామెత తమకు గుర్తు వచ్చిందని పైకి అందంగా కనిపించడం తప్ప విద్యార్థులు అనుభవిస్తున్న కష్టాలు వర్ణనా తీతం అని అన్నారు. గురుకులంలో మొత్తం 480 మంది స్కూల్ విద్యార్థులు 220 మంది కాలేజ్ విద్యార్థులు ఉన్నారని అన్నారు. వారికి 55 మరుగుదొడ్లు ఉండగా 3 మాత్రమే పనిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు.700 మందికి 3 మరుగుదొడ్లు వాడటం అంటే వారు ఎంత ఇబ్బంది పడుతున్నారో అధికారులు అర్థం చేసుకోవాలని కోరారు.గురుకులంలో 2మోటార్లు ఉన్నాయని అందులో 1పనిచేస్తుందని దాని వల్ల నీటి సమస్య ఏర్పడి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కాలేజీ విద్యార్థులకు సిబ్బంది సరిగా లేరని అన్నారు.మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపడంలో విఫలం అవుతుందని అన్నారు. కాలేజీ మరియు స్కూల్ సెక్షన్లను బైపర్కేసన్ చేయాలని,అందరూ కలిసి ఉండటం వల్ల సమస్య తీవ్రతరం అవుతుందని అన్నారు. అంతే కాకుండా మండలంలోని వరద బాధితుల్ని ఇక్కడి తరలించడం వల్ల 2నెలలు విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని అన్నారు. వారికి ప్రత్యేకంగా వసతి ఏర్పాటు ప్రభుత్వం చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్,జిల్లా నాయకులు పూనెం ప్రదీప్ కుమార్, పాయం సీతారామయ్య, బాబు బొర్రయ్య, మేకల నాగేశ్వరావు, మడకం నాగమణి(సర్పంచ్), పొడియం శ్రీరామూర్తి, ఎస్. ఎఫ్. ఐ. నాయకులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# అడిషనల్ ఎస్పీ ఆఫీసులో ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు



**చింతూరు, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతా రామరాజు జయంతి సందర్భంగా స్థానిక ఎడిషనల్ ఎస్పీ ఆఫీసులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పి పంకజ్ కుమార్ మీనా మాట్లాడుతూ అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలో ఉన్న విశాఖపట్నం జిల్లాలోని పాండ్రంకి గ్రామంలో 1897 జూలై 4 వ తేదీన క్షత్రియ కుటుంబంలో జన్మించిన అల్లూరి సీతారామరాజు భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని గిరిజన ప్రజల అభివృద్ధికి కృషి చేసి ఆనాటి బ్రిటిష్ సామ్రాజ్యమనే మహాశక్తినీ ఎదురొన్న గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతా రామరాజని తెలిపారు. సీఐ తెల్లం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలో భాగంగా ఉన్న విశాఖపట్నం జిల్లాలోని ఆదివాసీ గిరిజన ప్రజల సంక్షేమం కోసం, వారి అభివృద్ధి కొరకు పోరాటం చేసిన గొప్ప మన్యం వీరుడు అల్లూరి సీతా రామరాజు అని తెలిపారు. ఎస్సై రమేష్ మాట్లాడుతూ తూర్పుగోదావరి, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో చురుకుగా పాల్గొని బ్రిటిష్‌వారిని గడగడ లాడించారని పేర్కొన్నారు. అతి చిన్న వయసులోనే ప్రాణాలర్పించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సత్య దేవా మందిరంలో విశేష పూజలు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** తొలి ఏకాదశి సందర్భంగా కాకినాడ జర్నలిస్టు కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి మందిర ప్రాంగణంలో విశేష పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మధ్వ పురోహితులు యాతగిరి మద్వేష్ తెలిపారు.ఆరోజు ఉదయం స్వామివారికి నిర్మల్యాభిషేకం నిర్వహించడం జరుగుతుందని, శ్రీమద్ భాగవత పఠనము,గురువుల స్తోత్ర పారాయణం అనంతరం మంగళహారతి కార్యక్రమం ఉంటుందన్నారు. ద్వాదశ రోజున మాధ్వ గృహస్థులకు పంచకవ్య తీర్థాన్ని ఇవ్వడం జరుగుతుందని అందరూ పాల్గొని స్వీకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పంచగవ్య పూజ మరియు హోమ కార్యక్రమాన్ని మందిర వ్యవస్థాపకులు డాక్టర్ పరశురామ్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.చాతుర్మాస్యదీక్షా కార్యక్రమాన్ని సంకల్ప పూర్వకంగా నిర్వహించి ఆచరణకు ప్రారంభిస్తామని, తొలి మాసం శాఖావృతం వుంటుందని కావున ఆచరణలోకి వచ్చే పదార్థాలనే స్వయంపాకంలో అందించాల్సి వుంటుందన్నారు.

# అల్లూరి ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

**- ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కె.సిద్దు**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండల కార్యదర్శి కె. సిద్దు అన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఉప్పాడ బస్టాండ్ సెంటర్ నుండి స్థానిక తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిద్దు మాట్లాడుతూ... దేశ స్వతంత్రం కోసం పోరాడిన అల్లూరిని విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకొని విద్యా వ్యతిరేకంగా విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. విద్యా కార్పొరేటీకరణ, ప్రవేటీ కరణకు వ్యతిరేకంగా నేడు విద్యార్థులందరూ ఎస్ఎఫ్ఐ చేసే పోరాటాలలో అల్లూరి స్ఫూర్తితో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా కమిటీ సభ్యులు లోవరాజు, కావ్య, ప్రకాష్, వెంకటేష్, వివివి రమణ, తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం



రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : మండలంలోని రాజవొమ్మంగి, లబ్బర్తి, లాగరాయి గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంజరిగింది . టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు, రంపచోడవరం నియోజకవర్గ శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి భాస్కర్ సూచనలతో శుక్రవారం లబ్బర్తి, లాగరాయి బూత్‌లు 57,58,62 ,63లలో డోర్ టు డోర్ తిరిగి ఈ సంవత్సరం కాలంలో కూటమి ప్రభుత్వం పెంచిన పెన్షన్లు గురించి,ఉచిత 3 గ్యాస్ సిలిండర్ పథకం గురించి, తల్లికి వందనం పథకాలు గురించి వివరిస్తూ అదే విధంగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి కూడా ప్రజలకు వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో, మండల క్లస్టర్ ఇంచార్జి, ప్రధాన కార్యదర్శి ముప్పన కేశవ్, కో - ఇంచార్జి షేక్ బాజీ,యూనిట్ ఇంచార్జి పసగడుగుల తేజ, లబ్బర్తి గ్రామ కమిటీ అధ్యక్షులు సూరిశెట్టి సురేష్, బూత్ ఇంచార్జి రెడ్డి వరహాలు, ప్రవీణ్ కుమార్, మదం అప్పారావు, తాతాజీ, సత్యనారాయణ, గంటిమళ్ళ శ్రీను, చిదంబరం కార్యకర్తలు పాల్గొన్నారు. అలానే రాజవొమ్మంగిలో గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమం అభివృద్ధి గురించి వివరించారు.

# కూటమి పాలనలో అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్



**- సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కిర్లంపూడి మండలం టిడిపి నేతలు**

**కిర్లంపూడి, మేజర్ న్యూస్ :** కూటమి పాలనలో మన రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని కిర్లంపూడి ఎంపీపీ తోట రవి వ్యాఖ్యానించారు. శుక్రవారం కిర్లంపూడి మండలం వీరవరం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కిర్లంపూడి మండలం ఎంపీపీ తోట రవి, జడ్పిటిసి తోట గాంధీ, మండల టిడిపి అధ్యక్షులు చదరం చంటిబాబు, క్లస్టర్ ఇంచార్జి వీరం రెడ్డి కాశిబాబు పాల్గొన్నారు. వైసిపి హయాంలో పరదాల పాలన నడిచేదని కూటమి అధికారంలోకి వచ్చాక ప్రజా పాలన నడుస్తుందని వారు వ్యాఖ్యానించారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమం, అభివృద్ధి ఫలాల గురించి వివరించారు. నేరుగా ప్రజలతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో తల్లికి వందనం పథకం దేశంలోనే చరిత్ర సృష్టించిందని వ్యాఖ్యానించారు. ఒకటవ తారీఖునే ఠంచనుగా పింఛన్లు, ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు, గ్రామాల్లో పరుగులు పెడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఇలా అన్ని అంశాల్లో కూటమిపాలన ప్రజల ఆదరాభిమానాలను పొందుతుందన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రజలకు అభివృద్ధి సంక్షేమం అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తూర్పు డిఎస్వోగా వి.పార్వతీ



**రాజమహేంద్రవరం,మేజర్ న్యూస్ :** మచిలీపట్నం డి ఎస్ వో కార్యాలయంలో సహాయ సరఫరాల అధికారి వి.పార్వతీ పదోన్నతిపై తూర్పు గోదావరి జిల్లా జిల్లా సరఫరాల అధికారిగా గురువారం బాధ్యతలు చేపట్టడం జరిగింది. గురువారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడులను కలిసి జాయింట్ రిపోర్ట్ అందచెయ్యడం జరిగింది.